నమస్తే తెలంగాణ
నిజామాబాద్
10 నిజామాబాద్, గురువారం 6 ఫిబ్రవరి 2025 NIZAMABAD

- మొండి 'చెయ్యి' చూపిన రేవంత్ సర్కార్
- కులగణన సర్వేలో బీసీల జనాభా తగ్గడంపై ఉమ్మడి జిల్లాలో ఆందోళనలు
- స్థానిక ఎన్నికల్లో బీసీలకు అన్యాయం చేసేందుకు కుట్ర
- కేసీఆర్ హయాంలో చేపట్టిన సర్వేలో పారదర్శకత ఉంది...
- ఆయన పాలనలోనే బీసీల అభ్యున్నతి జరిగిందంటూ గుర్తుచేసుకుంటున్న బడుగులు


## అధినేతకు ఆహ్వానం



**బీఆర్ఎస్** పార్టీ కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఎంకే ముజీబుద్దీన్ కుమారుడి వివాహం ఈ నెల 10వ తేదీన హైదరాబాద్‌లో జరగనున్నది. ఈ వేడుకకు హాజరుకావాలని కోరుతూ తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ముజీబుద్దీన్ బుధవారం ఆహ్వానపత్రికను అందజేశారు. మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ఉన్నారు.
–కామారెడ్డి, ఫిబ్రవరి 5

# 'డిక్లరేషన్'కు తూట్లు!

బోధన్, ఫిబ్రవరి 5: ఇచ్చిన హామీలను తుంగలో తొక్కడంలో కాంగ్రెస్ ప్రభుత్వం తన నైజాన్ని మరోసారి బయటపెట్టింది. వెనుకబడిన తరగతుల అభివృద్ధి, అభున్నతిపై కాంగ్రెస్ పాలకుల కపట ప్రేమ మరోసారి తేటతెల్లమైంది. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా హస్తం పార్టీకి చెందిన మహామహా నేతల సమక్షంలో కామారెడ్డి వేదికగా బీసీ డిక్లరేషన్ ప్రకటించింది. బీసీల ఓట్లతో గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీ 'డిక్లరేషన్'ను తుంగలోకి తొక్కింది. విద్య, ఉద్యోగ రంగాల్లో అవకాశాలు కల్పించడంతోపాటు 42 శాతం రాజకీయ రిజర్వేషన్లు వస్తాయని ఆశించిన బీసీలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన కులగణన సర్వే ఫలితాలు ఆందోళన కలిగిస్తున్నాయి. కులగణన సర్వేతో తమకు ఎంతో మేలు జరుగుతుందని ఆశించిన బీసీలకు కాంగ్రెస్ ప్రభుత్వం తన సహజవైఖరితో మొండిచేయి చూపించింది. కులగణన సర్వేలో బీసీ జనాభాను తక్కువగా చూపించడం, కులగణనకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం అవసరమని కాంగ్రెస్ పాలకులు చెప్పడంతో కనీసం 42 శాతం రిజర్వేషన్లు వస్తాయనుకున్న తమకు ఆశాభంగమే జరిగిందని బీసీ సంఘాల నాయకులు మండిపడుతున్నారు.






### సర్వేలో తప్పులున్నయ్..

బోధన్, ఫిబ్రవరి 5: కాంగ్రెస్ సర్కార్ నిర్వహించిన కులగణన సర్వేలో అనేక తప్పులున్నయ్. బీసీలకు చాలా అన్యాయం జరిగింది. బీసీల సంఖ్య గతంలో కన్నా పెరగాలే తప్ప తగ్గడం అనేది ఉండదు. కేవలం కక్షపూరితంగా బీసీలను అణగదొక్కే యోచనతోనే సర్వే నిర్వహించారు. సర్వేలో వివరాలు కూడా సరిగా సేకరించలేదు. బీసీల సంఖ్య పెరిగితే రాజకీయ పరంగా రిజర్వేషన్లు పెంచాల్సి వస్తుంది .దీంతో వారి ప్రాబల్యం పెరుగుతుందనే ఉద్దేశంతో వారిని తప్పించాలనే బీసీల సంఖ్యను తక్కువగా చూపారు. స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని సర్వే నిర్వహించారు.

**- పెరిక రాజలింగం, రిటైర్డ్ హెచ్ఎం, ఎడపల్లి**

### 'డిక్లరేషన్'తో ఓట్లను కొల్లగొట్టి

2023 అసెంబ్లీ ఎన్నికలకు ముందు తాము అధికారంలోకి వస్తే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని చెబుతూ కాంగ్రెస్ పార్టీ 'కామారెడ్డి డిక్లరేషన్' ఇచ్చింది. ఈ డిక్లరేషన్‌తో బీసీల ఓట్లను కాంగ్రెస్ కొల్లగొట్టింది. తీరా, తమను గద్దెనెక్కించిన వెనుకబడిన తరగతులకు మోసం చేయడానికి 'కులగణన' పేరిట కుట్ర చేసిందని ఉమ్మడి జిల్లాలోని బీసీలు భగ్గుమంటున్నారు. పదేండ్లలో రాష్ట్రంలో బీసీల పెరిగిన జనా భా కేవలం 11.44 లక్షలేనని కులగణన నివేదికలు ఇవ్వడం ద్వారా తమ కులాల జనాభాను తక్కువగా చూపించారని ఆరోపిస్తున్నారు. తమకు న్యాయంగా రావాల్సిన రిజర్వేషన్లను రాకుండా చేయటానికి కుట్ర చేస్తున్నారని కాంగ్రెస్ పాలకులపై ధ్వజమెత్తుతున్నారు. రాష్ట్ర జనాభా వృద్ధిరేటును కూడా తక్కువగా చూపించడం గమనార్హం. వాస్తవానికి కులగణన సర్వే సక్రమంగా జరగలేదనే అభిప్రాయాలు వెల్లువెత్తుతున్నాయి.సర్వే కోసం ఒక ప్రణాళిక అంటూ లేకుండా పోయింది. కులగణనలో బీసీల జనాభా అంశమే కాకుండా ఇతరత్రా ఉన్న అనేక అంశాలపై ప్రజల్లో అనుమానాలు ఉండడంతో అనేక చోట్ల వారి నుంచి సహకారం కూడా లభించలేదు. ఇంటింటీ సర్వే కేవలం ఐచ్ఛికమేనని చెప్పడంతో.. ఇదే సాకుతో సర్వే చేసే ఎన్యూమరేటర్లు ఇంటింటికీ తిరగలేదని అనేక ఫిర్యాదులు వచ్చాయి. 2014లో కేసీఆర్ సీఎం అధికారంలోకి వచ్చిన తర్వాత అదే ఏడాది నవంబర్‌లో నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వే ఎంతో బాగున్నదని సామాజిక విశ్లేషకులు అంటున్నారు. సర్వే సమయంలో ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొని ప్రభుత్వానికి సహకరించారని, సర్వే అంటే అలా ఉండాలని చెబుతున్నారు. అవే ప్రమాణాలు, ప్రణాళిక, పారదర్శకతతో కాంగ్రెస్ సర్కార్ సర్వే చేపడితే బీసీల జనాభా శాతం గణనీయంగా పెరిగేదని పలువురు భావిస్తున్నారు



### కాంగ్రెస్ పాలకులు.. బీసీ వ్యతిరేకులు

ఏరుదాటే దాకా ఓడ మల్లన్న.. ఏరు దాటి నంక బోడి మల్లన్న అన్నట్టుగా ఉంది కాంగ్రెస్ సర్కార్ తీరు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు కామారెడ్డి డిక్లరేషన్ పేరిట బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని, ఇంకా ఏదేదో చేస్తామని హామీలు ఇచ్చింది. ఇప్పుడు వారు చేసిన డిక్లరేషన్ అమలుచేయడానికే మొండిచేయి చూపుతున్నారు. మమ్మల్ని ఏదో ఉద్ధరిస్తాడని రేవంత్‌రెడ్డిని అధికారంలోకి తీసుకువస్తే.. అసలుకే ఎసరు పెడుతున్నారు. రాష్ట్రంలో బీసీల జనాభా పెరగలేదని చెప్పడం వెనుక కాంగ్రెస్ పాలకుల బీసీ వ్యతిరేకతనే కారణం. ఇచ్చిన మాట ప్రకారం 42 శాతం రిజర్వేషన్లు అమలుచేయాలి. లేకుంటే బీసీల తిరుగుబాటుతో రేవంత్ గద్దె దిగాల్సివస్తుంది..

**-లోకం శ్రీనివాస్, పద్మశాలీ సంఘం బోధన్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి**



### తూతూ మంత్రంగానే కులగణన

రేవంత్ సర్కార్ చేయించిన కులగణన సర్వే తూతూ మంత్రంగానే జరిగింది. జనాభా వివరాల సేకరణలో ఒక పద్ధతంటూ పాటించలేదు. దొరికినవారినే సర్వే చేశారే తప్ప సమగ్రంగా అన్ని కుటుంబాలను సర్వే చేయలేదు. ఏదో రకంగా రాష్ట్ర జనాభా పెరుగుదలను, అందులో పెరిగిన బీసీల సంఖ్యను తక్కువగా చూపించాలన్నదే ఈ సర్వే ఉద్దేశంగా కనిపిస్తున్నది. ఎన్నికల సమయంలో బీసీలకు ఎన్నో హామీలు ఇచ్చి, వారి ఓట్లతో గద్దెనెక్కిన కాంగ్రెస్ .. ఒక కుట్ర ప్రకారం కులగణనలో బీసీల జనాభాను తగ్గించి చూపించింది. స్థానిక సంస్థల్లో బీసీలు అధికారంలోకి రావద్దనదే వారి కోరికగా కనిపిస్తున్నది. బీసీలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతాం.

**- పూర్మా గోపి, బోధన్**



### 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాల్సిందే..

కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాల్సిందే. ఈ హామీని తప్పించుకోవడానికో లేదా ప్రస్తుతం ఇస్తున్న 23 శాతం రిజర్వేషన్లను అరకొరగా పెంచడానికో కాంగ్రెస్ కులగణన నివేదికతో కపట నాటకం ఆడింది. కేసీఆర్ సర్కార్ బీసీల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు అమలుచేసింది. బీసీల కులవృత్తులకు పూర్వవైభవం తెచ్చింది. ఇప్పుడు అలాంటిదేమీలేదు. రాజకీయ రిజర్వేషన్ల పేరిట కులగణన నాటకమాడడం శోచనీయం. కులగణన సర్వేను మరోసారి శాస్త్రీయంగా నిర్వహించాలి.

**- అంకం సంతోష్, సాటాపూర్**

# తప్పుల తడకగా కుల గణన

- బీసీల జనాభా తగ్గడంపై అనుమానాలు
- బీసీ సంఘాల నేతల ఆగ్రహం
- మళ్లీ కుల గణన సర్వే నిర్వహించాలని డిమాండ్



విలేకరులతో మాట్లాడుతున్న బీసీ గ్రాడ్యుయేషన్ ఫోరం ప్రతినిధులు

ఆర్మూర్ టౌన్, ఫిబ్రవరి 5: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కుల గణన పూర్తిగా తప్పుల తడకగా ఉన్నదని తెలంగాణ బీసీ గ్రాడ్యుయేషన్ ఫోరం ప్రతినిధులు విమర్శించారు. బుధవారం వారు ఆర్మూర్‌లో విలేకరులతో మాట్లాడుతూ కామారెడ్డిలో ప్రకటించిన బీసీ డిక్లరేషన్ అమలు ఏమైందని ప్రశ్నించారు. ప్రభుత్వం అసెంబ్లీలో ప్రకటించిన కుల గణన లెక్కల ప్రకారం బీసీల సంఖ్య ఎలా తగ్గుతుంది, అగ్రవర్ణాల సంఖ్య ఎలా పెరుగుతుందని ప్రశ్నించారు. 2011 జనాభా దామాషా లెక్కల ప్రకారం బీసీల సంఖ్య పెరగాల్సి ఉండగా, తగ్గినట్లు ప్రభుత్వం చూపించడంపై మండిపడ్డారు. ప్రభుత్వం తప్పుడు నివేదిక రూపొందించిందని, దీంతో బీసీలకు మళ్లీ అన్యాయం జరుగుతుందన్నారు. వెనుకబడిన వర్గాలను మభ్యపెట్టేందుకు, స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కుల గణన నివేదిక తీసుకొచ్చారన్నారు. 56 శాతానికి పైగా బీసీల జనాభా ఉంటే, తక్కువగా ఉన్నట్లు చూపడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయని తెలిపారు. ప్రభుత్వం మళ్లీ సర్వే చేపట్టి పారదర్శకంగా నివేదిక రూపొందించి, బీసీల జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. బడుగు, బలహీనవర్గాలకు న్యాయం చేయకపోతే బీసీ సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. తెలంగాణ బీసీ గ్రాడ్యుయేషన్ ఫోరం చైర్మన్ అబ్బగౌని అశోక్, ప్రతినిధులు పాల్గొన్నారు.

# బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం

సీపీఐ నాయకుల ఆగ్రహం
కామారెడ్డిలో కేంద్ర బడ్జెట్ ప్రతుల దహనం



కేంద్ర బడ్జెట్ ప్రతులను దహనం చేస్తున్న సీపీఐ నాయకులు

కామారెడ్డి, ఫిబ్రవరి 5: కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేసిందని సీపీఐ నాయకులు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ మేరకు కామారెడ్డి జిల్లా కేంద్రంలోని కొత్తబస్టాండ్ ఆవరణలో బుధవారం బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం కార్యదర్శి పశ్య పద్మ మాట్లాడుతూ... బడ్జెట్‌లో తెలంగాణపై కేంద్ర ప్రభుత్వం చిన్నచూపు చూసిందని మండిపడ్డారు. పాలమూరు రంగారెడ్డి, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, నిరుద్యోగ సమస్యను పట్టించుకోలేదని అన్నారు. ఉపాధి హామీ పథకానికి కేవలం రూ.86 కోట్లు కేటాయించడం శోచనీయమన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలను పట్టించుకోలేదన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థను మెరుగుపర్చాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి దశరథ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రాజశేఖర్, ప్రెసిడెంట్ దేవయ్య, మల్లేశ్, హైదర్ ఖాసీం, సాయిలు, నాగమణి, రాజమణి, రేఖ, భాస వ్వ, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# నీటి సమస్యను పరిష్కరించుకున్న గ్రామస్తులు

- రాయకూర్‌లో పది నెలలుగా నీటి ఇబ్బందులు
- ఆగ్రహంతో ఇటీవల కార్యదర్శిని నిర్బంధించిన గ్రామస్తులు
- ప్రభుత్వం, అధికారులు స్పందించకపోవడంతో ముందుకు వచ్చిన గ్రామపెద్దలు

రాయకూర్‌లో నూతనంగా మోటరు వేయించిన గ్రామస్తులు



రుద్రూర్, ఫిబ్రవరి 5 : మండలంలోని రాయకూర్ గ్రామంలో 10 నెలలుగా నీటి సమస్య వేధిస్తున్నది. గ్రామస్తులు అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా తాత్కాలికంగా ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారే తప్ప సమస్యకు పరిష్కారం చూపడం లేదు. దీంతో ఆగ్రహించిన గ్రామస్తులు జీపీ కార్యదర్శిని గత నెల 28న నిర్బంధించిన విషయం తెలిసిందే. అయినా ప్రభుత్వం, అధికారులు స్పందించలేదు. నీటి కోసం మహిళలు పడుతున్న కష్టాలను చూడలేక గ్రామపెద్దలు తమ సొంత డబ్బులతో బుధవారం బోరు బావిని తవ్వించి, మోటరును బిగించారు. దీంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి, తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామస్తులు కోరుతున్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ అనిల్ పటేల్, మాజీ ఉప సర్పంచ్ గంగాధర్, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

# నల్లబ్యాడ్జీలతో వీఆర్ఏల నిరసన



పిట్లంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న వీఆర్ఏలు

పెద్ద కొడప్‌గల్ (పిట్లం), ఫిబ్రవరి 5: పిట్లం తహసీల్ ఆఫీస్ ఎదుట వీఆర్ఏలు బుధవారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..వీఆర్ఏల సమస్యలను రెవెన్యూ మంత్రికి చెప్పుకోవడానికి మంగళవారం శాంతియుతంగా వెళ్తున్న వీఆర్ఏలను పోలీసులు అడ్డుకుని నిర్బంధించారని తెలిపారు. తమ సమస్యలను పరిష్కరిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలుచేయకుండా, అక్రమంగా అరెస్టు చేస్తున్నదని మండిపడ్డారు. వీఆర్ఏల నిర్బంధాన్ని ఖండిస్తూ నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశామన్నారు. గురువారం సైతం రాష్ట్ర వ్యాప్తంగా నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన ప్రదర్శనలు చేస్తామని తెలిపారు.

# మోర్తాడ్‌లో 'డబుల్ ఇండ్ల'కు తాళం!

- తిరిగి స్వాధీనం చేసుకున్న అధికారులు
- ఎంపికైన వారికే ఇండ్లు కేటాయిస్తామని తహసీల్దార్ వెల్లడి



డబుల్ బెడ్‌రూం ఇండ్లకు కొందరు వేసిన తాళాలు

మోర్తాడ్, ఫిబ్రవరి 5: మోర్తాడ్‌లో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇండ్లకు కొందరు బుధవారం తాళాలు వేశారు. విషయం తెలుసుకున్న స్థానిక అధికారులు సిబ్బందితో తాళాలు తీయించి, తిరిగి స్వాధీనం చేసుకున్నారు. ఎంపికైన వారికే ఇండ్లను కేటాయిస్తామని తహసీల్దార్ కృష్ణ స్పష్టం చేశారు. అర్హులు మాత్రమే వెళ్లాల్సి ఉంటుందని, ఎవరు పడితే వారు డబుల్ బెడ్‌రూం ఇండ్లకు తాళాలు వేసుకుంటే చట్టపరంగా చర్యలు తీసుకోవాల్సి ఉంటుదని హెచ్చరించారు. మండల కేంద్రంలో డబుల్ బెడ్ రూం ఇండ్ల సముదాయంలోని మూడు బ్లాకుల్లో 70 ఇండ్లు ఖాళీగా ఉన్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో లబ్ధిదారులను ఎంపిక చేసి డబుల్‌బెడ్‌రూం ఇండ్లను అందజేశారు. మిగిలిన వాటిని రెండో విడుతలో లబ్ధిదారులను ఎంపిక చేసి అందజేస్తామని మాజీమంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి పంపిణీ కార్యక్రమంలో ప్రకటించారు. అనంతరం రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడింది. ఇందిరమ్మ ఇండ్ల పథకం తేవడం, ప్రజాపాలనలో లబ్ధిదారుల జాబితాను ప్రకటించింది. దీంతో కొందరు చెప్పుడు మాటలు విని, మంగళవారం మూడు బ్లాక్‌ల్లోని మొత్తం 24 ఇండ్లకు తాళాలు వేసుకున్నారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ కృష్ణ సిబ్బందితో వాటిని తొలగింపజేసి, ప్రభుత్వ పరంగా కొత్త తాళాలు వేయించారు. డబుల్‌బెడ్‌రూంలు తమకు వస్తాయో రావోనన్న ఆత్రుతతో తాళాలు వేసుకున్నారా లేదా ఎవరైనా వారిని తాళాలు వేయించుకోవాలని పురమాయించారా అనే అంశంపై అధికారులు దృష్టి సారించాల్సి ఉంది.

# రెండోరోజూ మాజీ సర్పంచుల అరెస్టు



మాజీ సర్పంచులను అరెస్టు చేసిన ముప్కాల్ పోలీసులు

**ఆమరణ దీక్షకు అనుమతి ఇవ్వాలంటూ బోధన్ పోలీసులకు వినతి**



బోధన్ రూరల్ పోలీస్‌స్టేషన్ వద్ద మాజీ సర్పంచులు

మోర్తాడ్/ముప్కాల్/బోధన్ రూరల్, ఫిబ్రవరి 5: గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులను చెల్లించాలని కోరుతూ తాజా మాజీ సర్పంచులు తలపెట్టిన 'చలో హైదరాబాద్'ను రెండోరోజూ బుధవారం సైతం పోలీసులు అడ్డుకున్నారు. మోర్తాడ్, ముప్కాల్,బోధన్, సాలూరా తదితర మండలాల్లో మాజీ సర్పంచులను అదుపులోకి తీసుకొని పోలీసుస్టేషన్‌కు తరలించారు. అరెస్టయిన వారిలో మోర్తాడ్ మండల సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు బోగ ఆనంద్, ముప్కాల్ మండలంలోని మాజీ సర్పంచులు మట్ట సందీప్, ఆకుల రాజారెడ్డి, మారెల్లి విష్ణు ఉన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పనిచేసిన సర్పంచుల బిల్లులు ఆపి వారి జీవితాలతో ఆడుకుంటున్న ప్రభుత్వానికి తమ ఉసురుతగుల్తదని మండిపడ్డారు. బిల్లులు రాక మాజీ సర్పంచులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నా ప్రభుత్వం కండ్లు తెరవకపోవడం విడ్డూరమన్నారు. బిల్లులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. పెండింగ్ బిల్లులు చెల్లించకపోతే త్వరలో ఆమరణ నిరాహార దీక్ష చేస్తామని, అనుమతి ఇవ్వాలని కోరుతూ బోధన్ ఎస్‌హెచ్‌వోకు మాజీ సర్పంచులు నాగయ్య, గంగాధర్, కోర్వ గంగాధర్, సిర్ప సుదర్శన్ వినతిపత్రం అందజేశారు.